

రన్నర్లుగా గద్వాల బాల బాలికల జట్లు


7
రెండో స్థానంలో నిలిచిన బాలుర జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

అర్హులకు అందని గృహజ్యోతి

- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న జనం
- దరఖాస్తులు అప్‌లోడ్ చేయడంలో జాప్యం
- బిల్లులు చెల్లించలేకపోతున్న నిరుపేదలు
- గ్రామాల్లో విద్యుత్ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న పరిస్థితి



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన నివాస గృహాలకు ఉచిత కరెంట్ అమలు చేస్తున్నారు. కానీ నాగర్‌కర్నూల్ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గృహజ్యోతి పథకం అర్హులందరికీ వర్తించడం లేదు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేసినందుకే తమకు పథకం వర్తించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 22వేల సర్వీసుల వరకు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాల్లో నిరుపేదలు విద్యుత్ బిల్లులు చెల్లించకుండా విద్యుత్‌శాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్హులందరికీ గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు. 6

- తాడూరు, ఆంధ్రజ్యోతి

గుర్తింపు ఉంటేనే క్రీడా కోటా

- పుట్టగొడుగుల్లా గుర్తింపు లేని క్రీడా సంఘాలు
- జాతీయ, అంతర్జాతీయ టోర్నీల పేరిట దందా
- ఆటల ఎంపికలో క్రీడాశాఖ సూచనలు పాటించాలి
- సూచిస్తున్న క్రీడాశాఖ అధికారులు, సీనియర్ క్రీడాకారులు 7




ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్


రెస్క్యూ సిబ్బందితో టన్నెల్ లోపలికి వెళ్తున్న ట్రైన్


టన్నెల్ లోపలికి వెళ్తున్న రెస్క్యూ బృందాలు


ఘటనా స్థలానికి సమీపంలో పేరుకుపోయిన నీరు, బురద

ప్రపంచంలోనే అతి పెద్దదైన నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటనలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. సొరంగం లోపల చిక్కుకుపోయిన ఎనిమిది మందిని క్షేమంగా బయటికి తీసుకురావడానికి ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ, సింగరేణి, హైడ్రా, సికింద్రాబాద్ బైసన్ డివిజన్ ఇంజనీరింగ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం పని చేస్తున్నాయి. అయితే ప్రమాదం జరిగిన ప్రాంతానికి కొద్ది దూరంలో టన్నెల్ పైకప్పు కూలి పడటంతో మట్టి, బురద పేరుకు పోయి సహాయక చర్యలు సవాల్‌గా మారాయి. దాంతో ఆ మట్టి, బురదను మోటార్ల సాయంతో బయటికి ఎత్తిపోస్తున్నారు. 100 మీటర్ల మేర 15 అడుగుల ఎత్తున పేరుకుపోయిన ఆ బురదను ఎత్తిపోస్తేగానీ రెస్క్యూ బృందాలు ఘటనా ప్రాంతానికి వెళ్లే అవకాశం లేదు. దాంతో గంటలు గడిచే కొద్దీ టెన్షన్ పెరుగుతోంది. కటిక చీకట్లో.. తినడానికి తిండి, తాగడానికి నీరు లేక, ఆక్సిజన్ కూడా అందుతుందో లేదో తెలియని పరిస్థితిలో వారెలా ఉన్నారోనని కుటుంబీకులు కలత చెందుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

పూర్తి వివరాలు మెయిన్‌లో..



ట్రైన్‌లోకి ఎక్కుతున్న రెస్క్యూ సిబ్బంది, టన్నెల్ వద్ద రెస్క్యూ బృందం


ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్తున్న మంత్రి జూపల్లి

పిందె పట్టడం లేదు

- తెగుళ్ల బెడదతో రాలుతున్న మామిడి పూత
- ప్రతీ ఏటా తగ్గుతున్న దిగుబడి
- అవగాహన లేక నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని ఉద్యానశాఖ అధికారులు


పిందెలు కాయకుండానే రాలిపోయిన పూత

కేటీదొడ్డి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో మామిడి దిగుబడి అధికంగానే వస్తుండేది. కానీ తెగుళ్ల బెడదతో ప్రతీ ఏటా దిగుబడి తగ్గుతూ వస్తోంది. దీంతో మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డి మండలంలో రైతులు 3 వేల ఎకరాలలో మామిడి సాగుచేస్తున్నారు. మామిడి మొక్కలు నాటిన ఐదు సంవత్సరాల తర్వాత దిగుబడి వస్తుంది. కానీ ఇక్కడి రైతులకు మార్కెట్‌పై సరైన అవగాహన లేకపోవడం వల్ల దళారులు తోటలను గుత్తకు తీసుకుంటే వాళ్లకే ఇస్తున్నారు. దీనివల్ల దళారులు చెట్లకు మోతాదుకు మించి మందులు, వేయడం వల్ల చెట్లు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. దీంతో దిగుబడిపై ప్రభావం చూపుతోంది.

పూత రాలడంతో మొదలు..

ప్రస్తుతం వాతావరణ మార్పులతో ఉదయం విపరీతమైన చలి, మంచు, మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరగడంతో వాతావరణం మామిడికి అనుకూలించక పూత రాలుతోంది. ఈ ఏడాది పూత ఆలస్యంగా రావడం కూడా ఒక కారణంగా రైతులు చెబుతున్నారు. మామిడి పూత దశలో ఉన్నప్పుడు మందులు పిచికారీ చేయకూడదు. కానీ నల్లి పురుగు, బూజు రావడం వల్ల తప్పని పరిస్థితిలో ఎక్కువ మందులను పిచికారీ చేస్తున్నారు. దీంతో మామిడిలో పిందె ఏర్పడేందుకు సహాయపడే కీటకాలు మృతి చెందడంతో పూతలో సంపర్కం జరగక పిందెలు రావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా మిరప పంటకు సోకిన నల్లి ఆ పంట పూర్తయిన తర్వాత మామిడి చెట్లకు సోకడం వల్ల పంట దిగుబడి తగ్గుతూ వస్తోందని మామిడి రైతులు అంటున్నారు. ఉద్యానశాఖ అధికారుల సలహాలు తీసుకుంటే అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. మామిడి కాయలు కోతకు వచ్చేంత వరకు 15 రోజులకు ఒక తడి ఇవ్వాలి. కాయ కోత కోయడానికి 15 రోజుల ముందు నుంచి నీటి తడులు బంద్ చేయాలి. దీని వల్ల కాయ నుంచి జీడి కారకుండా ఉంటుంది.


కేటీదొడ్డిలో పూత రాలుతున్న మామిడి తోట

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



ప్రభుత్వం మామిడి రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. 20 ఏళ్లుగా 10 ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నాను. మార్కెట్ సౌకర్యం లేకపోవడం వల్ల దళారులను ఆశ్రయిస్తున్నాము. దళారులు మార్కెట్‌లో ధరలు లేవని తక్కువ ధరకు తీసుకుంటున్నారు. రైతులకు అందుబాటులో మార్కెట్ సౌకర్యం కల్పిస్తే సొంతంగా మార్కెట్‌కు కాయలను తీసుకెళ్లవచ్చు.

- కొండయ్య, మామిడి రైతు, కేటీదొడ్డి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ప్రభుత్వం మామిడి రైతులను ప్రోత్సహించాలి. ఎప్పటికప్పుడు ఉద్యానశాఖ అధికారులు రైతులకు సరైన సూచనలు, సలహాలు ఇవ్వాలి. అధికారులు అందుబాటులో లేకపోవడంతో దళారులు పూత ఎక్కువగా రావడానికి, కాయలు తొందరగా రావాలని మోతాదుకు మించి మందులను వాడుతున్నారు. ఎక్కువసార్లు చెట్లకు మందులను పిచికారి చేయడం వల్ల ప్రతీ సంవత్సరం పంట దిగుబడి తగ్గుతూ వస్తోంది.

- వెంకటేష్, మామిడి రైతు, నందిన్నె

అభివృద్ధికి వ్యతిరేకం కాదు

- అభివృద్ధి ముసుగులో జరిగే అవినీతికి వ్యతిరేకం
- అవినీతిపరుడు, అహంకారి నిరంజన్‌రెడ్డితో నాకేంపని
- రూపాయికి చెల్లని నాయకులు నాపై విమర్శలు చేస్తారా
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి నియోజకవర్గంలో జరిగే అభివృద్ధికి తాను వ్యతిరేకం కాదని, అభివృద్ధి ముసుగులో జరిగే అవినీతిని మాత్రమే వ్యతిరేకిస్తున్నానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోపాల్‌పేటలో శనివారం మార్కెట్ యార్డు విషయంలో నేను వ్యతిరేకించింది మండల అభివృద్ధి కోసమేనని అన్నారు. మండల కేంద్రంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేయడం వలన ఆ ప్రాంతం అభివృద్ధితో పాటు పలువురికి ఉపాధి కలుగుతుందని అన్నారు. ఒక స్వార్థపరుడి కోసం మార్కెట్ యార్డును ఊరి బయట నిర్మించడం సరి కాదన్నారు. కొందరు చిల్లర నాయకులు శవాల మీద డబ్బులు ఏరుకునే వారు నా గురించి మాట్లాడుతారా అని మండిపడ్డారు. 45 ఏళ్లలో గోపాల్‌పేట మండలాన్ని అభివృద్ధి చేసింది తానేనని, ఆ మండలంలో చేసిన అభివృద్ధిలో నా పాత్రనే కీలకంగా ఉందన్నారు. మోజర్లలో కూడా పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన గోదాం విషయంలో కూడా అక్కడి ప్రజలు వ్యతిరేకించారన్నారు. దళితుల భూముల్లో గోదాం నిర్మాణానికి వెళ్తే తన్ని పంపించడంతో ఉద్యాన కళాశాలలో గోదాం నిర్మాణానికి మంత్రితో శంకుస్థాపన చేయించారని విమర్శించారు. మూడు పార్టీలు మారిన నీవు నాపై ఆరోపణలు చేస్తావా అని ఎమ్మెల్యే మేఘారెడ్డిపై మండిపడ్డారు. 45 ఏళ్ల రాజకీయంలో ఉన్నానని, మచ్చ లేకుండా దేశంలోనే నీతి, నిజాయితీ గల నాయకులలో తాను ఒకరినని తెలిపారు. అవినీతిపరుడు, అహంకారి అయిన నిరంజన్‌రెడ్డితో నాకేం పని అని, నియోజకవర్గ అభివృద్ధి కోసం పెండింగ్‌లో ఉన్న పనుల వివరాల కోసం నా పీఏ భాస్కర్‌ను పంపి ఫైల్స్ తెప్పించుకున్నానే తప్పా అతనితో రోజు మాట్లాడాల్సిన అవసరం నాకేముందన్నారు. తాను మద్దతు తెలిపినందుకే మేఘారెడ్డికి 25వేల ఓట్లు పడ్డాయని అన్నారు. మేఘారెడ్డికి సొంతంగా ఓటు బ్యాంకు ఎక్కడుందని ప్రశ్నించారు. పూటకు ఓ పార్టీ మారే నీవు, రేపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేకపోతే బీజేపీలోకి, మరో పార్టీలోకి వెళ్తావని మేఘారెడ్డిపై మండిపడ్డారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

- జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 98.25 శాతం విద్యార్థుల హాజరు
- వనపర్తి జిల్లా వ్యాప్తంగా 97.17శాతం

గద్వాల సర్కిల్/వనపర్తి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి 5, 6, 7, 8, 9వ తరగతుల ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 12 కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 4,743 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,660 (98.25శాతం)మంది విద్యార్థులు హాజరయ్యారు. 83 మంది విద్యార్థులు హాజరు కాలేదని పరీక్ష జిల్లా కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ నర్సింగరావు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.


ఎర్రవల్లిలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

వనపర్తి జిల్లాలో 9 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 5,047 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,904 మంది (97.17 శాతం) హాజరయ్యారు. 143 మంది గైర్హాజరయ్యారు. మద్రికుంటలోని గిరిజన గురుకుల పాఠశాల, నాగవరం తండా వద్ద అనూస్ జూనియర్ కళాశాలలో పరీక్ష సరళిని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు.


వనపర్తిలో పరీక్ష సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

జలాధివాసంలోనే సంగమేశ్వర ఆలయం

- శివరాత్రి భక్తులకు సంగమేశ్వరుడి దర్శనం లేనట్లే

కొల్లాపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే సంగమేశ్వరుడి దర్శనం ఈ ఏడాది శివ భక్తులకు లేనట్టే. ప్రతీ ఏడాది మహాశివరాత్రిలోపే శ్రీశైలం తిరుగు జలాలు వెనక్కి తగ్గి సప్తనదుల సంగమ క్షేత్రం సంగమేశ్వర ఆలయం జలాధివాసం నుంచి బయటపడేది. కానీ ఈ ఏడాది మహాశివరాత్రి ఇంకా రెండు రోజులే ఉన్నా.. కేవలం ఆలయం సగభాగం మాత్రమే జలాధివాసం నుంచి బయటపడడంతో శివ భక్తులు ఆలయ గోపురం దర్శనం చేసుకుని పూజలు చేసుకునే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం శ్రీశైలం నీటి మట్టం 849 అడుగులు, ఆలయంలోకి వెళ్లాలంటే 9 అడుగులు తగ్గాలి. గర్భాలయంలో వేపదార శివలింగాన్ని దర్శనం కావాలంటే ఇంకా రెండు అడుగుల తగ్గాలి. మొత్తం 11 అడుగుల నీటి మట్టం తగ్గాలని ఆలయ పురోహితులు చెబుతున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల భక్తులకు సంగమేశ్వరుడి దర్శనం లేనట్లే అని అంటున్నారు.


కృష్ణానది వరద జలాల నుంచి బయటపడని సంగమేశ్వర ఆలయం

రేబిస్ వ్యాధితో బాలుడి మృతి

- జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని క్యాతూరులో ఘటన 7


హర్షవర్ధన్ (ఫైల్)

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దైవ చింతన మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తుందని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలోని పాత బజార్ 3వ వార్డులో సీతారామ, ధ్వజస్తంభం, విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజ చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రావులను సన్మానించారు. అనంతరం నూతన బొడ్రాయికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, బండారు కృష్ణ, డాక్టర్ డ్యానియేల్, సూర్యవంశపు గిరి తదితరులు ఉన్నారు.

నవాబ్‌పేట అభివృద్ధే లక్ష్యం

» జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



కాకర్జాలలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నవాబ్‌పేట మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాకర్జాల గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తులసీరాం, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు వాసుయాదవ్, ఉమర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాలకు రహదారులు సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు దృష్టిలో పెట్టుకుని రహదారుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కుత్నపల్లి, లింగంపల్లి, లోకిరేవు, నవాబ్‌పేట గ్రామాల మీదుగా నిర్మిస్తున్న డబుల్ రహదారి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో రుద్రారం వయా కొండాపూర్, దయపంతులపల్లి మీదుగా నవాబ్‌పేట, యన్మనగండ్ల వయా రుక్కంపల్లి, కారూర్, మల్లారెడ్డిపల్లి, కూచూర్, రుద్రారం, నవాబ్‌పేట వయా కామారం పోమాల్, కేశవరావ్ పల్లి, కొల్లూర్, కారుకొండ గేట్ నుంచి పోలెపల్లి గ్రామాల మీదుగా డబుల్ రహదారులు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. సబ్‌ప్లాన్ కింద దళిత వాడల్లో సీసీరోడ్డు పనులకు రూ.1.60 కోట్లు మంజూరు చేశామని, త్వరలో నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. అంతకుముందు కొల్లూర్, కాకర్జాల గ్రామాల్లో వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు సంతోష్‌నాయక్, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లెలమ్మ బోనాలు

జడ్చర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మల్లెలమ్మ బోనాల పండుగను ఆదివారం జడ్చర్లలోని మేదిర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని నాగసాల సమీపంలోని మల్లెలమ్మ ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని, నిమ్మబావి గడ్డ నుంచి మల్లెలమ్మ గుట్ట వరకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. మల్లెలమ్మ బోనాల పండుగలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మల్లెలమ్మ దీవెనలతో నియోజకవర్గం అంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పల త, వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, కౌన్సిలర్లు, మేదరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెస్క్యూ సిబ్బందికి అన్నదానం

అందించిన మాజీ సైనికుడు



భోజనం వడ్డిస్తున్న మాజీ సైనికుడు ప్రతాపరెడ్డి

దోమలపెంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలో చిక్కున్న ఎనిమిది మందిని రక్షించేందుకు వచ్చిన సైనికులకు ఆదివారం దోమలపెంటకు చెందిన మాజీ సైనికుడు ప్రతాపరెడ్డి మజ్జిగ, భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు సమాయక చర్యల్లో పాల్గొనే సైనికులు అకలి దప్పులు తనకు తెలుసని అందుకే తన వంతుగా ఆ సహాయక చర్యలు చేపట్టేవరకు భోజనాలు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో దోమలపెంట మాజీ ఉప సర్పంచ్ బుదాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో సేవాదళ్‌ది ప్రముఖ పాత్ర

● మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి వాజిద్ మహెక్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ పాత్ర ప్రముఖమైనదని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ఇన్‌చార్జి వాజిద్ మహెక్ అన్నారు. చివరి ఆదివారం సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయ ఆవరణలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. రాబోయే రోజుల్లో ప్రతి వాడలో జెండావిష్కరణలు చేస్తామన్నారు. హర్ గావ్, హర్ గలీ సేవాదళ్ నినాదంతో ముందుకెళ్తామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సుభాష్ ఖత్రి, అలీ, లోకనాథ్, సంజీవ్‌రెడ్డి, జగదీశ్, వెంకటలక్ష్మి, ఉమర్, హమీద్ పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



వల్లభాపురం దత్త పీఠంలో బ్రహ్మోత్సవాల అంకురార్పణలో పాల్గొన్న భక్తులు

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం వల్లభాపురం శ్రీదత్త పీఠంలో ఆదివారం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఘనంగా అంకురార్పణ నిర్వహించారు. ఆలయ పూజారి రఘు అంకురార్పణ, ధ్వజారోహణ, అఖండ దీ పారాధన, కలశ ప్రతిష్ఠ, నిత్య అభిషేకం, ప్రత్యేక పూజ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 26న మహా శివరాత్రి మహా రుద్రాభిషేకం, సాయంత్రం రథోత్సవం, దీపతోరణం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 27న శివ పార్వతుల కల్యాణం, 28న రేణుక మాతకు బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయని పూజారి రఘు వివరించారు. కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని దత్తపీఠం ట్రస్టు కమిటీ, దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో మాతా నిరంజన్, ఆనంద సరస్వతి, మాజీ ఎంపీపీ వనజ, పసుపుల మాజీ సర్పంచు దత్తు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాలుకు రూ.6,769 ధర

● నవాబ్‌పేట మార్కెట్‌కు ఒక్కరోజే 3,341 క్వింటాళ్లు రాక

నవాబ్‌పేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం వివిధ గ్రామాల నుంచి రైతులు వేరుశనగను తీసుకువచ్చారు. ఆదివారం ఒక్కరోజే 3341 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,769, కనిష్ఠంగా రూ.5,020, సాధారణ ధర రూ.6,240 చెల్లించినట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. రైతులు వారు పండించిన పంటను కనీస మద్దతు ధర వచ్చే వరకు విక్రయించుకోవాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు.

ఘనంగా శివలింగ బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మాగనూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మాగనూరు మండలం అమ్మపల్లి గ్రామంలో శివలింగ బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం ఘనంగా జరిగింది. అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో నంది విగ్రహ ప్రతిష్ఠ, బలిపీఠ ప్రతిష్ఠ, పాదాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మాగనూరు మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మాజీ సర్పంచు రవీందర్ హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాంబాబు



నారాయణపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాంబాబు నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఈనెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించినట్లు వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచారక్ పగుడాకుల బాలస్వామి ఆదివారం తెలిపారు. వీహెచ్‌పీ నారాయణపేట జిల్లా తొలి అధ్యక్షుడిగా డాక్టర్ రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కన్న శివకుమార్, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్‌గా వడ్ల శ్రవన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జోగు సాయప్ప నియమితులయ్యారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాంబాబు ఎన్నిక కావడంతో జిల్లావాసులు పలువురు అభినందించారు. డాక్టర్ రాంబాబు బాల్యం నుంచి హిందుత్వ భావాలు కలిగి ప్రస్తుతం నారాయణపేట గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలో పట్టణ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన కన్న శివకుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మద్దూర్ ప్రఖండ ప్రముఖ్‌గా పనిచేసిన జోగు సాయప్ప జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. బజరంగ్‌దళ్ నారాయణపేట కన్వీనర్‌గా కొనసాగుతున్న వడ్ల శ్రవణ్‌కుమార్ బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు.

ఘనంగా మాణికేశ్వరి మాత

పాదక ప్రతిష్ఠాపన వార్షికోత్సవం



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న శివయ్యస్వామి

దామరగిద్ద, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉడ్మల్‌గిద్ద గ్రామంలో మాణికేశ్వరి మాత ఆశ్రమంలో మాత పా దక ప్రతిష్ఠాపన 11వ వార్షికోత్సవాన్ని భక్తు లు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాణిక్యగిరి ట్రస్టు కార్యదర్శి శివయ్యస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మా ట్లాడారు. మాత యొక్క అహింసా మార్గా న్ని బోధించారు. కార్యక్రమానికి కర్ణాటక, తెలంగాణల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జనార్దన్‌రెడ్డి, సాయన్న, బాల్‌చందర్‌రెడ్డి, రామ కృష్ణారెడ్డి, లక్ష్మణ్, వీరప్ప, భగవంతు, నర్సింలు, జల్లప్ప, ఎల్లప్ప, బాలచందర్, గజలప్ప తది తరులున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



కాలభైరవ విగ్రహానికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని న్యూ మోతీనగర్‌లో వెలిసిన కాశీ విశ్వనాథ అన్నపూర్ణ సమేత ఆలయంలో ఆదివారం మహా చండీయాగం నిర్వహించారు. యాగానికి ముందు కాశీ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన కాలభైరవుడి విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కాలభైరవ విగ్రహానికి అభిషేకం, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. చాగంటి ప్రవీణ్ కుమార్ శర్మ కాలభైరువుడి మహత్యాలు భక్తులకు వివరించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కాలభైరవుడి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రుక్మిణి ప్రభాకర్, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు రాములు యాదవ్, రవికుమార్, యాదగిరి, నాగేష్, నరేష్, వీరేష్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో రాణించడానికి కావాల్సిన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఆదివారం సంతు సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై సేవాలాల్ చిత్ర పటానికి పూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంతుసేవాలాల్ ఆశయాలను ప్రభుత్వం గౌరవిస్తూ ముందుకు సాగుతుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధిపర్చనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు పట్టణంలో గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, సంతు సేవాలాల్ సంఘం జాతీయ అధ్యక్షుడు సంజునాయక్, నాయకులు తదితరులు ఉన్నారు.

రాజకీయ కక్ష సాధింపు సరికాదు

-ప్రహరీ కూల్చివేతను ఖండించిన బీఆర్ఎస్ నాయకుడు తిరుపతయ్య

లింగాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని, రాత్రివేళల్లో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే ప్రహరీ కూల్చివేశారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కేటీ తిరుపతయ్య ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని అంబటిపల్లిలో సింగిల్ విండో అధ్యక్షుడు హనుమంతురెడ్డికి చెందిన ప్రహరీ కూల్చివేత ఖండిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం లింగాలలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హను మంతరెడ్డి మాట్లాడుతూ సుమారు 50ఏళ్ల క్రితం భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి మేరకు ముందస్తు సమాచారం లేకుండా ఎక్స్‌కవేటర్లతో ప్రహరీను కూల్చడానికి వచ్చారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మైసమ్మ దేవతను దర్శించుకున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాల నుంచి ఈ ఆదివారం భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆదివారం హుండీ ద్వారా 57వేల 999 రూపాయలు, టికెట్ల ద్వారా 32వేల 46రూపాయలు మొత్తం 90వేల 445 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.



నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం వద్ద భక్తులు

అర్హులకు అందని గృహజ్యోతి

- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న జనం



మీటర్ రీడింగ్ తీస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

తాడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం అర్హులందరికీ వర్తించడం లేదు. ఈ పథకం ద్వారా 200యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించే వారికి ఫ్రీగా ఇవ్వనుంది. ఈ క్రమంలోనే చాలా కుటుంబాలు గృహజ్యోతి పథకం కోసం ప్రజాపరిపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో జరిగిన పొరపాటు వనల తాము బిల్లులు చెల్లించాల్సి వస్తోందని కొందరు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక లక్ష 54వేల 360 సర్వీసులకు గాను 70వేల సర్వీసులు మాత్రమే గృహజ్యోతికి ఎంపిక చేశారు. వివిధ కారణాలతో గృహజ్యోతి పథకానికి ఎంపిక కాలేదు. అర్హత ఉండి పథకం వర్తించని వారు ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిచారు. అప్పుడు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. కానీ జిల్లా వ్యాప్తంగా అర్హత ఉన్న సుమారు 22వేల సర్వీసులకు ఈ పథకం వర్తించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1 లక్ష 7వేల 246 కుటుంబాలు గృహజ్యోతి ద్వారా ఉచిత కరెంటు పొందుతున్నాయి. మిగిలిన 47వేల 114సర్వీసుల్లో దాదాపుగా 15వేల సర్వీసుల వరకు రేషన్‌కార్డు లేకపోవడం, ప్రభుత్వం ఉద్యోగం కలిగి ఉండటం కారణంగా లబ్ధిపొందలేదు. ఇవి పోను మిగిలిన 32వేల 114 కుటుంబాల్లో దాదాపుగా 10వేల కుటుంబాలు దరఖాస్తు చేసినప్పటికీ ఆన్‌లైన్‌లో సమస్యల కారణంగా అర్హత పొందలేదు. ఇవి పోను మిగిలిన 22వేల సర్వీసుల వరకు లబ్ధిదారుల వివరాలు కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదనే ఆరోపణలు వస్తున్నాయి. గృహజ్యోతి పథకం అర్హులందరికీ వర్తించాలంటే ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొంతమందికి గృహజ్యోతి పథకం వర్తించి ఉచిత విద్యుత్ పొందుతుంటే, మరికొందరు విద్యుత్ బిల్లులు కట్టకపోగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిపై అసభ్య పదజాలంతో విరుచుకుపడుతున్నారు. ఇప్పటికైనా నాగర్ కర్నూల్ జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్హులందరికీ గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు.

నాకు కరెంట్ బిల్లు వస్తోంది



ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం అమలు కాకపోవడం వలన కరెంట్ బిల్లు వస్తోంది. ప్రతీ నెల బిల్లు చెల్లిస్తున్నాను. తాను అన్నివిధాలుగా పథకానికి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టకపోవడం మూలంగా ఎంపిక కాలేదు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గృహజ్యోతి పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలి.

- క్రిష్ణయ్య, సిర్సవాడ గ్రామం

ప్రస్తుతం సర్వర్ డౌన్ అవుతోంది..



ప్రస్తుతం గృహజ్యోతి పథకానికి సంబంధించిన దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలంటే సర్వర్ డౌన్ అవుతోంది. అర్హత ఉండి పథకం వర్తించనివారి నుంచి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తున్నాం. సర్వర్ అందుబాటులోకి వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపర్చే ప్రక్రియ కొనసాగిస్తాం. అంత వరకు లబ్ధిదారులు సహకరించాలి.

- అంజనేయులు, ఎంపీడీవో, తాడూరు

కనుల పండువగా ఈదమ్మ జాతర



ఉత్సవాలకు ముస్తాబైన ఈదమ్మ అమ్మవారు, శిష్యుడు మాందాత

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామదేవత ఈదమ్మ అమ్మవారి జాతర ఉత్సవం కనుల పండువగా ని ర్వహించారు. ఆదివారం ఉత్సవాల్లో పాల్గొనడా నికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ఈదమ్మ అమ్మవారితో పాటు మాందాత విగ్రహాలకు అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, బాజా భజంత్రీ, బుడుగ జంగాల వారి ఆటపాట, పోతురాజుల విన్యాసాలు మహిళల శివసత్తుల మధ్య మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి ఈదమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అందంగా అలంకరించిన బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ నెల 23 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఈదమ్మ జాతర ఉత్సవాలు వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో భక్తులు కోళ్ల, పొట్టేలు, బోనాలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుం డా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. జాతరలో మిఠాయి, బొమ్మల, గాజుల దుకాణాలు వెలిశాయి.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి సందర్భంగా గద్వాల ఆర్టీసీ డిపోలో ఈ నెల 26 నుంచి 28 వరకు 15 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు, ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రాజోలిలో తాగునీటి ఎద్దడి

రాజోలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. కొట్టాల వీధి, వీవర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీ, బింగల్ పేట కాలనీల్లో మూడు రోజులు నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. వేసవి కాలం రాకుండానే తాగునీటి సమస్య ఎదురైతే వేసవిలో పరిస్థితి ఏంటని ప్రజలు అంటున్నారు. క్రమం తప్పకుండా తాగునీరు అందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్యను వివరణ కోరగా.. పాత రాజోలిలో అవసరమైన మేరకు వాటర్ ట్యాంకులు లేవు. అందుకే మిషన్ భగీరథ నీరు అందడం లేదు. రాజోలి తాగునీటి పంప్‌హౌస్ శుద్ధి చేయడంతో మూడు రోజులు తాగునీరు సరఫరా కాలేదు. సోమవారం నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

ఆర్డీఎస్ కెనాల్‌కు నిలిచిన సాగునీరు



నీరులేక వెలవెలబోతున్న ఆర్డీఎస్ కెనాల్

వడ్డేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నాలుగైదు రోజులుగా ఆర్డీఎస్ కెనాల్‌కు సాగునీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీలో వేసుకున్న పంటలు ఎండు ముఖం పడుతున్నాయని, తక్షణమే నీరు వదలాలని రైతులు కోరుతున్నారు. మార్చి 20వ తేదీ వరకు సాగునీరు అందితేనే పంటలు చేతికి వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. తక్షణమే తుమ్మిళ ఎత్తిపోతల పథకం ద్వారా నీరు వదలాలని, కేసీ కెనాల్‌లో నీరు పుష్కలంగా ఉన్నా ఆర్డీఎస్ కెనాల్ వెలవెలబోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి నీరు వదలాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులును సంప్రదించగా.. 290.5 మీటర్ల నీరు ఉన్నదని, 291.5 మీటర్ల నీరు వస్తే మోటార్లు ఆన్ చేస్తామని చెప్పారు. త్వరలోనే సాగునీరు వదులుతామని సమాధానం ఇచ్చారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కెంద్యాల రాజు (ఫైల్)

భూత్పూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. జాతీయ రహదారిపై ఆదివారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ గ్రామానికి చెందిన కెంద్యాల రాజు(40) ద్విచక్ర వాహనంపై భూత్పూర్ వైపు నుంచి జడ్చర్లకు వెళ్తున్నాడు. అంబటిపల్లి స్టేజీ వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీన్నొది. ప్రమాదంలో కెంద్యాల రాజు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జడ్చర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలోని జిన్నింగ్ మిల్లులో శనివారం అర్ధరాత్రి తర్వాత అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. సమాచారం అందుకున్న జడ్చర్ల ఫైర్ ఇంజన్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేసారు. జిన్నింగ్ తర్వాత వృథా పత్తిబేళ్లు ఉంచిన ప్రాంతంలో మంటలు చెలరేగడంతో అగ్నిప్రమాదం జరిగిందని మిల్లు ప్రతినిధులు తెలిపారు. బేళ్లతో పాటు, యంత్రాలు కూడా కాలిపోయాయని చెప్పారు. దాదాపు ఐదు లక్షల రూపాయల ఆస్తినష్టం జరిగిందని తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య


రాములు (ఫైల్)

మద్దూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, మద్దూర్ మండల పరిధిలోని పెదిరిపాడ్ శివారులో జరిగింది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రెనివట్ల గ్రామానికి చెందిన సిరగని రాములు (50) గత 20న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయంపై ఆయన భార్య నర్సమ్మ 22న పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని పెదిరిపాడ్ శివారులో ఆదివారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు తెలిపారు. అతడు సిరిగని రాములుగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని నారాయణపేట ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

మద్యానికి డబ్బులివ్వలేదని యువకుడి బలవన్మరణం


అనిల్ (ఫైల్)

అలంపూరు చౌరస్తా, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని తక్కశిల గ్రామానికి చెందిన జోగు జయమ్మ కుమారుడు జోగు అనిల్ (18) పదవ తరగతి వరకు చదివి, కూలీకి వెళ్తుండేవాడు. కానీ నాలుగు నెలలుగా ఏ పనీ చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం ప్రతీ రోజు తల్లిని వేధిస్తూ ఉండే వాడు. శనివారం రాత్రి కూడా మద్యానికి డబ్బులు అడిగాడు. పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ ఉంటే ఎలా అని ఆమె మందలించింది. దీంతో అతడు క్షణికావేశంలో ఇంట్లోనే చీరకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

రెండు గుడిసెలు దగ్ధం

» సర్వం కోల్పోయిన చిరు వ్యాపారులు


కాలిపోయిన గుడిసె వద్ద బాధితుడు

అయిజ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గుడిసెలు కాలి బూడిదయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అన్నమయ్య జిల్లా, నిమ్మలపల్లి మండలం, సోమనపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ, వెంకటరమణ అక్కాతమ్ముళ్లు. వీరిద్దరి కొడుకులు రాజు, రమేశ్‌లు 15 ఏళ్ల క్రితం అయిజ పట్టణంలోని భరత్‌నగర్ కాలనీలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలంలో రెండు గుడిసెలు వేసుకున్నారు. వివిధ ప్రాంతాలు తిరుగుతూ గాజుల వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఆదివారం జాతరలో గాజులు విక్రయించి, రాత్రి గుడిసెలకు వచ్చారు. భోజనం చేసేందుకు సిద్ధం అవుతుండగా, మంటలు చెలరేగి నిమిషాల్లోపే దగ్ధమయ్యాయి. వాటిల్లోని దుస్తులు, వంట సామగ్రి, పరుపులు, విక్రయించేందుకు తెచ్చుకున్న గాజులు, రూ. 65 వేలు, బియ్యం, రెండు ఫ్యాన్లు కాలిపోయాయి. సర్వం కాలిపోయి కట్టుబట్టలతో మిగిలామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోడేరు/ పెద్దమందడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు ఎస్ఐ గోకారి, వనపర్తి జిల్లా, పెద్దమందడి ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధి లోని పసుపుల శివారులో అర్ధరాత్రి సమయంలో అనుమతి లేకుండా అక్రమంగా ట్రాక్టర్లో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, డ్రైవర్ ఆది శివాజీ, యజమాని ఆది కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోకారి తెలిపారు.


బుగ్గపల్లి తండా వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్

- వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలంలోని బుగ్గపల్లి తండా ప్రాంతంలో శనివారం రాత్రి కానిస్టేబుల్ ఆనంద్, నరేశ్‌లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న వాగు వద్ద ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్లో ఇసుకను నింపుతున్నట్లు గమనించారు. అక్కడున్న వారిని విచారించి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో కొత్తకోట మండలం కానాయపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మహేశ్, యజమాని రామన్‌గౌడ్, ఎక్స్‌కవేటర్ డ్రైవర్ బన్నీలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



గుర్తింపు ఉంటేనే.. క్రీడా కోటా



» పుట్టగొడుగుల్లా గుర్తింపు లేని క్రీడా సంఘాలు
» జాతీయ, అంతర్జాతీయ టోర్నీల పేరిట దందా » ఆటల ఎంపికలో క్రీడాశాఖ సూచనలు పాటించాలి
» సూచిస్తున్న క్రీడాశాఖ అధికారులు, సీనియర్ క్రీడాకారులు


హ్యాండ్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక వికాసం, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయి. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. తాను ఎంచుకున్న క్రీడాంశంలో ఎదగాలని ప్రతీ క్రీడాకారుడు ఆశిస్తాడు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే తపనతో ప్రోత్సహిస్తారు. వారి ఆశలు, ఆశయాలను ఆసరాగా చేసుకొని కొన్ని గుర్తింపు లేని క్రీడా సంఘాలు జాతీయ, అంతర్జాతీయ టోర్నీల పేరుతో క్రీడాకారులను వంచిస్తున్నాయి. అమాయకులైన క్రీడాకారులను ఆసరాగా చేసుకొని ధనార్జనే ధ్యేయంగా వారి బంగారు భవిష్యత్తుతో ఆటలాడుతున్నాయి. ఎలాంటి ప్రయోజనాలూ లేని క్రీడా ధ్రువపత్రాలను అంటగట్టి పబ్బం గడుపుకుంటున్నాయి. ఉన్నత స్థాయి పోటీలు అని చెప్పుండటంతో తల్లిదండ్రులు సైతం వేలల్లో వెచ్చిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎందరో క్రీడాకారులు గుర్తింపు లేని సంఘాలు నిర్వహించే ఆటల పోటీల్లో పాల్గొని నష్టపోతున్నారు. ఆ టోర్నీల్లో సాధించిన పతకాలు, ధ్రువపత్రాలకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో క్రీడా కోటా ఉండదని తెలుసుకుని బాధపడుతున్నారు.

మోసం చేస్తున్న సంఘాలు

గుర్తింపు లేని కొన్ని క్రీడా సంఘాలు కొత్త దందాకు తెర లేపాయి. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీ లను నిర్వహిస్తూ, వేలాది రూపాయలు వసూలు చేసి క్రీడాకారులను మోసం చేస్తున్నారు. గత ఏడాది దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన అథ్లెటిక్స్ టోర్నీలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సంఘానికి, ఈ టోర్నీకి ఒలింపిక్ సంఘం, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఎలాంటి గుర్తింపూ లేదు. అలాగే ఖేలో భారత్ పేరుతో గత ఏడాది నేపాల్‌లో ఓ అంతర్జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీతో పాటు అథ్లెటిక్స్, కరాటే, కబడ్డీ, యోగా, ఫుట్‌బాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్, కిక్ బాక్సింగ్, హాకీ, స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. టోర్నీ నిర్వాహకులు ఆకర్షణీయమైన ఆఫర్లతో క్రీడాకారులకు ఎర వేశారు. టోర్నీలో ఆడేందుకు పేరు నమోదు చేసుకుంటే రాను పోను రైలు టిక్కెట్‌తో పాటు, వసతి, పర్యాటక ప్రాంతాల సందర్శన అవకాశాలతో ఆకర్షించి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేశారు. కానీ ఈ టోర్నీకి ఒలింపిక్ భారత సమాఖ్య, బీసీసీఐల నుంచి గుర్తింపు లేదు. విషయం తెలియని ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పలువురు వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ టోర్నీకి వెళ్లి వచ్చారు.

క్రీడా సంఘాలకు గుర్తింపు తప్పని సరి

ఒలింపిక్, భారత ఫెడరేషన్ గుర్తింపు ఉన్న క్రీడాం శాల్లోనే చిన్నారులను చేర్పించాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో కొన్ని క్రీడా సంఘాలకు మాత్రమే ఒలింపిక్ సంఘం, క్రీడా సంఘాల ఫెడ రేషన్ గుర్తింపు ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, ఖోఖో, హ్యాండ్‌బాల్, ఆర్చరీ, నెట్‌బాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాలకు మాత్రమే గుర్తింపు ఉంది. గుర్తింపు లేని క్రీడా టోర్నీల్లో ఆడితే సమయంతో పాటు డబ్బు వృథా అవుతుంది. వాటిలో ఎంత ప్రతిభ చూపినా వారు ఇచ్చే ధ్రువపత్రాలకు విలువ ఉండదు. ఉద్యోగాలు, ఉన్నత విద్యావకాశాలకు క్రీడా కోటా వర్తించదు. ఇదే సందర్భంలో పలు క్రీడా సంఘాలు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కోసం కొట్లాడుతున్నాయి. ఒక్కో క్రీడకు రెండు మూడు క్రీడా సంఘాలు ఉండటంతో, తమకంటే తమకు గుర్తింపు ఉందంటూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నాయి.

గుర్తింపు ఉంటేనే ప్రయోజనం



క్రీడాకారులు గుర్తింపు ఉన్న క్రీడలను ఎంపిక చేసుకుంటేనే ప్రయోజనం ఉంటుంది. చాలా క్రీడా సంఘాలకు గుర్తింపు ఉండదు. వారు నిర్వహించే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లి క్రీడాకారులు మోసపోతున్నారు. ఒలింపిక్ సంఘం, జాతీయ ఆయా క్రీడా సంఘాల ఫెడరేషన్ గుర్తింపు ఉన్న ఆటలే ఆడాలి. జిల్లాలోని క్రీడా సంఘాలు ఎన్నికలు నిర్వహించి తమకు రిపోర్టు చేస్తే గుర్తింపు ఇస్తాం. కరాటే క్రీడకు ఎలాంటి గుర్తింపు లేదు.

- ఎస్.శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి మహబూబ్‌నగర్

కరాటే పేరుతో నిలువు దోపిడీ

రాష్ట్రంలో, ఉమ్మడి జిల్లాలో కరాటేకు ఎలాంటి గుర్తింపూ లేదు. పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్పించేందుకు ప్రభుత్వం కొన్ని బాలికల పాఠశాలలను గుర్తించింది. చాలా మంది మాస్టర్లు క్లబ్‌లను ఏర్పాటు చేసుకుని పిల్లలకు కరాటే నేర్పించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్తున్నామని వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. వారిచ్చే ధ్రువపత్రాలు దేనికీ పనికి రావు. మహబూబ్‌నగర్ లోని కొన్ని కరాటే క్లబ్‌ల మాస్టర్లు కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలను సైతం నిర్వహిస్తుండటం గమనార్హం. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు గుర్తింపు ఉన్న క్రీడలను ఎంపిక చేసుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. ఈ విషయంపై వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించాల్సి ఉంది.

కాయ కాయకో కవరు

» మామిడి రక్షణకు రైతుల ప్రయత్నం


మామిడి కాయలకు కట్టిన కవర్లు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మామిడి కాయలు తెగుళ్ల బారిన పడకుండా రైతులు వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. కాయకాయకు ప్లాస్టిక్ కవర్లు కట్టారు. దీంతో కాయలకు తెగుళ్ల బెడద నుంచి రక్షణ లభిస్తుందని చెప్తున్నారు. మంచి రంగుతో పండి ధర ఎక్కువగా పలుకుతుందని మామిడి అంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన రైతు ఆకునమోని మల్లేశ్ తమ మామిడి తోటలో కాసిన ప్రతీ కాయకు కవరు కట్టాడు. గత ఏడాది ఈ ప్రాంతంలోని రైతులు ఈ పద్ధతిని పాటించడంతో వారికి మంచి లాభాలు వచ్చాయని తెలిపారు. దీంతో తాను ఈ ఏడాది మూడు రూపాయలకు ఒక కవరు చొప్పున కొనుగోలు చేసి ప్రతీ కాయకు కట్టినట్లు చెప్పారు. మొత్తం 250 మామిడి చెట్లు ఉన్న ఈ తోటలో ఇప్పటికే వంద చెట్ల కాయలకు కవర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిగతా చెట్లకు కూడా కాయలు కాసి, కొంచెం పెద్దవయ్యాక కవర్లు అవసరం అవుతాయని చెప్పారు.

రేబిస్ వ్యాధితో బాలుడి మృతి


క్యాతూరు ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

అలంపూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు మండల పరిధిలోని క్యాతూరు గ్రామంలో కుక్క కాటుకు గురైన బాలుడి రేబిస్ వ్యాధి సోకి మృతి చెందాడు. కుటుంసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. క్యాతూరు గ్రామానికి చెందిన సాయికుమార్, వెంకటలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు హర్షవర్ధన్ (4), కుమార్తె హర్షిత(3) ఉన్నారు. గత నెల 22న ఇద్దరు పిల్లలను కుక్క కరిచింది. తల్లిదండ్రులు వారికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పాపకు చికిత్స చేసిన వైద్యులు, బాలుడికి చిన్న గాటు పడిందని, ఏమీ కాదని చెప్పడంతో ఇంటికి వెళ్లిపోయారు. కానీ నెల రోజుల తర్వాత బాలుడు విచిత్రంగా ప్రవర్తిస్తుండటంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, రేబిస్ వ్యాధి సోకిందని, బతకడం కష్టం అని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కుమారుడిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ఆసుపత్రి వద్ద ఆందోళన

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం చేయకపోవడం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. చికిత్స చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అలంపూరు ఎస్ఐ క్యాతూర్ ఆసుపత్రి వద్దకు చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడి నచ్చచెప్పారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కనుల పండువగా రథోత్సవం

» రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

గట్టు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలోని చాగదోణలో ఎల్లమ్మ రథోత్సవాన్ని ఆదివారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు చేసి రథంపై ఉంచారు. అర్చకులు ప్రత్యేక పూజలు రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు, పురప్రముఖులు రథాన్ని దశమికట్ట వరకు లాగారు. ఉత్సవాన్ని తిలకించేందుకు స్థానికులతో పాటు, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎల్లమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉచితంగా చికెన్‌ఫ్రై, గుడ్లు

» జడ్చర్లలో ప్రజలకు పంపిణీ


వండిన చికెన్, గుడ్లను పంపిణీ చేస్తున్న పౌల్ట్రీ యజమానులు

జడ్చర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూపై నెలకొన్న అపోహలను తొలగించేందుకు పౌల్ట్రీ యజమానులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని క్రాస్‌రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఉడకబెట్టిన గుడ్లు, వండిన చికెన్‌ను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. బర్డ్‌ఫ్లూ బారిన పడుతామన్న భయంతో గుడ్లు, చికెన్ కొనుగోలు చేయడం లేదని వారు తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి, భయాన్ని పోగొట్టేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిపుణులు సూచించిన మేరకు గుడ్లు, చికెన్‌ను ఉడకబెట్టాలని, దీంతో ఎలాంటి వైరస్ ఉన్నా నశిస్తుందని వారు వివరించారు.

స్పోర్ట్స్ బాక్స్

రన్నర్లుగా గద్వాల బాల బాలికల జట్లు

» ఏపీలోని కర్నూల్‌లో ఫుట్‌బాల్ టోర్నమెంట్


బాలికల జట్టుకు షీల్డ్ అందిస్తున్న నిర్వాహకులు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో జోగుళాంబ గద్వాల జిల్లా బాల, బాలికల జట్లు రన్నర్లుగా నిలిచాయని కోచ్ విజయకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన యంగ్ స్టార్ గ్రాస్‌రూట్ ఒక్క రోజు టోర్నీలో వారు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆదివారం గద్వాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు, కోశాధికారి పి.త్యాగరాజు, ప్రవీణ్ సేవాసమితి అధ్యక్షుడు ఇండికా శివ వారిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు నరసింహ రాజు, ఎస్వీ రమణ, జగన్, తిరుమల్, ఆనంద్, నవీన్, మాజీ కౌన్సిలర్ బండల పాండు, ప్రశాంత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీల్లో విజేతలకు పతకాలు


విజేతలతో విశ్రాంత పీఈటీ గోపాలం

మక్తల్‌రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా స్థాయి మౌంటేన్ సైక్లింగ్ పోటీల్లో విజేతలకు ఆదివారం అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాలం పతకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం, శారీరక దృఢత్వం, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీలు రమేశ్‌కుమార్, మీనాకుమారి, గాయత్రి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సోమవారం నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎ. రాజసింహుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

న్యూస్ బాక్స్

మసీద్, మదర్సా భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని 2వ వార్డులో కొత్త వహిదా నూర్ మసీద్ ఉర్దూ, అరబిక్ విద్య, మదర్సా ప్రార్థనా భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మతపెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, మహబూబ్, నవీన్‌రెడ్డి ఉన్నారు.

ఏప్రిల్ 12న అంబేడ్కర్ ఆలోచన పండుగ

గట్టు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆలోచన పండుగను ఏప్రిల్ 12న ఘనంగా నిర్వహించుకునేందుకు సన్నద్ధం కావాలని అల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బుడకల ప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ ఆశయ ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్లడానికి అందరూ కృషి చేయాలని తెలిపారు.

శివస్వాములకు అన్నదానం

వడ్డేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూలకల్లు శివారులో ఉన్న శివాలయం వద్ద ఆదివారం పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 14ఏళ్లుగా జూలకల్లు ఆర్డీఎస్ శివాలయం వద్ద తాము పాదయాత్ర చేస్తున్న భక్తులకు అన్నదానం, ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తున్నామని దాతలు తెలిపారు. శెట్టి, బాబేష్ శెట్టి, ఓబయ్య శెట్టి, వీరేష్‌శెట్టి పాల్గొన్నారు.

గాడ్గే బాబా చూపిన మార్గం అనుసరణీయం

ధరూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని బడుగు, బలహీన వర్గాల చదువు కోసం ఆరాటపడిన విద్యావేత్త సంత్ గాడ్గే బాబా అని, ఆయన చూపిన మార్గం భవిష్యత్ తరాలకు అనుసరణీయమని బీఎస్పీ మండల కార్యదర్శి దేవన్న అన్నారు. సంత్ గాడ్గే బాబా జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని సోంపురంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల చుట్టూ తిరిగితే జ్ఞానం వస్తుందని, ప్రజలను విద్య వైపు నడిపించి గొప్ప యోధుడని కీర్తించారు. నిస్సహాయత నుంచి బయట పడాలంటే చదువు ఒక్కటే మార్గమని చెప్పిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అడుగుజాడల్లో విముక్తి కలుగుతుందని ప్రజలకు వివరించారని గుర్తుకు చేశారు. ఆధ్యాత్మిక బోధనలతో ప్రజల్లో చైతన్యం తెచ్చిన గాడ్గే బాబా వీధులను సైతం శుభ్రం చేసి మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అశోక్, చిన్న, లాజర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

అయిజటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని అలంపూర్ అసెంబ్లీ బీఎస్పీ అధ్యక్షుడు శశివర్మ అన్నారు. గాడ్గే బాబా జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పులికల్ గ్రామంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. బహుజన్ సమాజ్ పార్టీ గాడ్గేబాబా ఆశయాలను కొనసాగిస్తుందని తెలిపారు.

మన్‌కీబాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

అయిజటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పరీక్షల సమయం విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్‌లో సూచించారు. ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులు వీక్షించారు. వారు మాట్లాడుతూ ప్రధాని విద్యార్థులను ఉద్దేశించి పలురకాల సూచనలు చేయటంతో పాటు, మహిళలు కూడా అన్ని రంగాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారన్నారు. కార్యక్రమంలో భగత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, లక్ష్మన్ గౌడ్, వీరేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం7:30 నుంచి 8:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లి, నర్సన్‌దొడ్డి, ఉప్పేరు, ద్యాగ దొడ్డి, సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, ఇందుకు రైతులు, గృహవినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

కలగానే అగ్నిమాపక కేంద్రం

- 25 ఏళ్లుగా వినతులు
- అగ్ని ప్రమాదం జరిగితే గద్వాల నుంచి వాహనం రావాల్సిందే..
- అంతలోపే భారీ నష్టం

అయిజటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అయిజ మండలం అతిపెద్దది. వ్యాపార, వ్యవసాయ పరంగా ఎంతో అభివృద్ధి చెందిన పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని 25 ఏళ్లుగా ప్రజలు కోరుతూనే ఉన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. మండలంలో 28 పంచాయతీలు, అయిజ మునిసిపాలిటీలో 20 వార్డుల్లో కలిపి మొత్తం జనాభా 1.20 లక్షలకు పైనే ఉంది. మండలంలోని ఏ గ్రామంలో అయినా, మునిసిపాలిటీలో అగ్నిప్రమాదం సంభవిస్తే 32 కిలోమీటర్ల దూరంలో ఉండే గద్వాల నుంచి ఫైర్‌ఇంజన్ రావాల్సి ఉంటుంది. అంత దూరం ప్రయాణం చేసి వాహనం వచ్చేలోపు దాదాపు గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది. అంతలోపు నష్టం జరుగుతుంది. మండలంలో చివరిగ్రామంగా ఉన్న కుట్కనూరు అయిజ కేంద్రానికి 21 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కిస్టాపురం, రాజాపురం, వేణిసోంపురం, నౌరోజీక్యాంపు లాంటి గ్రామాలు కూడా అయిజకు 15 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. మిగతా 23 పంచాయతీల్లో 15 గ్రామాలు కూడా 10 కిలోమీర్లకు ఎక్కువ దూరంలోనే ఉంటాయి. మండలానికి చిట్టచివరి గ్రామంలో అగ్నిప్రమాదం జరిగితే గద్వాల జిల్లా కేంద్రం నుంచి 51 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఫైర్ ఇంజన్ వచ్చేలోపే బూడిద మిగులుతుంది.



అయిజ మండలం సంకాపురం స్టేజీవద్ద మిరప లోడుకు నిప్పంటుకోవడంతో ఆర్పుతున్న రైతులు (ఫైల్)



అయిజ దగ్ధమవుతున్న పశుగ్రాసం (ఫైల్)

ఐదు మండలాలకు ఉపయోగం

అయిజ పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటైతే అయిజతో పాటు వడ్డేపల్లి, రాజోళి, మల్దకల్, గట్టు మండలాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ మండలాల్లో ఉన్న అనేక గ్రామాలు పట్టణానికి 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. గతంలో కూడా అనేక అగ్నిప్రమాదాల్లో రూ.లక్షల విలువచేసే ఆస్తులు బుగ్గిపాలైన సందర్భాలు ఉన్నాయి. రైతులకు సంబంధించిన పశుగ్రాసం వాములు, మిరప లోడ్లతో వెళ్తున్న డీసీఎం షార్టు సర్క్యూట్ కారణంగా కాలిపోయి రైతులకు తీవ్రనష్టం జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. మేడికొండలో జరిగిన అగ్నిప్రమాదం వల్ల ఏకంగా 12 గుడిసెలు అగ్నికి ఆహుతై నడిగడ్డలో సంచలం జరిగింది. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు మాత్రం నాయకులు ఆఘమేఘాల మీద బాధితులను పరామర్శించటానికి వచ్చి తప్పకుండా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పి పోతారు. ఇంతవరకు కూడా నాయకుల మాట ఆచరణకు నోచుకోలేదు.

ప్రతిపాదనలు పంపుతాం

అయిజకు అగ్నిమాపక కేం ద్రం కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. ఇక్కడి ప్రజలకు అగ్నిప్రమాదం జరిగితే స్థానికంగా ఫైర్‌స్టేషన్ ఉంటే నష్టాన్ని చాలా వరకు తగ్గించే అవకాశం ఉంటుంది.

- జ్యోతి, తహసీల్దార్, అయిజ

సంపద సృష్టించే వారికే బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరు రాములు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరు రాములు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దేశ సంపదకు మూల స్తంభాలైన కార్మికులకు కేంద్ర బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత లభించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరు రాములు అన్నారు. ఇటీవల కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికవర్గ ప్రయోజనాల కోసం కేవలం రూ.3,600 కోట్లు కేటాయించడం దౌర్భాగ్యమన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివారం పట్టణంలోని వాల్మీకి భవనంలో సీఐటీయూ, తెలంగాణ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ స్థూల జాతీయోత్పత్తిలో కీలక భాగస్వాములైన అసంఘటిత రంగంలోని కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించకపోవడం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. పైగా 12 గంటల పనిదినం పేరుతో కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడటం దివాళా కోరుతనమన్నారు. ఉపాధి హామీ పథకానికి గతేడాది కన్నా నిధులు తగ్గించడంతో పాటు ఉపాధి కల్పన కోసం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేకపోవడం ఆర్థిక అసమర్థ విధానాలకు నిదర్శనమన్నారు. సంపన్నులకు రాయితీలు ఇస్తూ, పేదలకు సంక్షేమం పేరుతో చేస్తున్న ఖర్చును ఉన్నత న్యాయస్థానం సైతం ఆక్షేపించడం దురదృష్టకరమన్నారు. సంపన్న వర్గాలకు గడిచిన ఐదేళ్లలో రూ.13లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన కేంద్రం తీరును మేధావులు, న్యాయస్థానాలు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో రైతు, కార్మిక, కర్షకుల ప్రయోజనాలకు ప్రాధాన్యత లేకపోవడాన్ని నిరసిస్తూ ఆయా వర్గాల ప్రజలు బడ్జెట్ సవరణ కోసం పెద్దఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, వీవీ నరసింహ, ఉప్పేరు నరసింహ, జి.రాజు, ఏమేలమ్మ, డ్యాం అంజి, లక్ష్మణ్, సంజీవరాజు, మంచాల నరసింహ, ఈశ్వర్, విష్ణు, రఘు, తిరుపతి, నరేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మినీ స్టేడియం

- రూ.2కోట్ల వ్యయంతో నిర్మాణం
- శిథిలావస్థకు చేరుతున్న భవనం

ఎర్రవల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో 2014లో ఐదు ఎకరాల వీస్తీర్ణంలో రూ. 2.10కోట్ల వ్యయంతో మినీ స్టేడియాన్ని అన్ని వసతులతో నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు కనీసం తెరిచిన దాఖలాలు లేవు. అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో విఫలం కావడంతో రూ.కోట్ల ప్రజాధనం వృథాగా మారింది.



ఎర్రవల్లికి సమీపంలో నిరుపయోగంగా ఉన్న మినీ స్టేడియం

ముందుచూపు లేకుండా..

వాస్తవానికి 44వ జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఈ క్రీడా మైదానం ఉమ్మడి జిల్లా స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించేందుకు సౌకర్యాంగా ఉంటుంది. హడావిడిగా ప్రభుత్వ స్థలంలో ముందు చూపు లేకుండా నిర్మించడంతో ప్రస్తుతం పర్యవేక్షణ లేకపోవడంతో నిరుపయోగానికి కారణంగా మారింది. దీంతో స్టేడియం పూర్తి శిథిలావస్థకు చేరుతుంది. కిటికీ అద్దాలు ధ్వంసమై, తలుపులు విరిగిపోయాయి. అప్పట్లో అధికారులు క్రీడా మైదానాన్ని ఉపయోగంలోకి తెచ్చేందుకు సాధ్యం కాకపోవడంతో ఖాళీగా ఉన్న ఈ భవనంలో 2017 నుంచి 2023 వరకు ఆవాస పాఠశాలను నిర్వహించారు. పాఠశాలను గద్వాలకు మార్చడంతో స్టేడియం మరింత అధ్వాన స్థితికి చేరింది.

దారి సక్రమంగా లేక..

నిర్మాణం చేపట్టిన స్థల విషయంలోనే తప్పిదం జరిగినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. స్టేడియానికి కావాల్సిన విస్తీర్ణం ఉన్నా వెళ్లేందుకు ప్రధాన సమస్య పరిష్కరించలేనిదిగా ఉంది. స్టేడియాన్ని పీజేపీ కాలువకు అనుసంధానంగా నిర్మించడంతో విఫలమైంది. ప్రస్తుతం స్టేడియాన్ని ఉపయోగంలోకి తేవాలంటే దారి విస్తరించడమో లేక మరో దారిని ఏర్పాటు చేస్తే తప్పా పరిష్కారానికి నోచుకోదు.

బడ్జెట్‌కు ప్రతిపాదించాను



స్టేడియాన్ని పరిశీలించాను. దారి సమస్యే తీవ్రంగా ఉంది. ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రస్తుతం శిథిలంలో ఉన్న పనులను చేసేందుకు బడ్జెట్ వెచ్చించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశించాను. కలెక్టర్‌తో మాట్లాడి దారి సమస్య పరిష్కరిస్తాం.

- శివసేనారెడ్డి, శాట్స్ చైర్మన్

రైతుల మధ్య సత్సంబంధాలు బలపడుతాయి

- సింగిల్‌విండో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి

అయిజ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పశుబల ప్రదర్శన పోటీలతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతుల మధ్యన సత్సంబంధాలు బలపడుతాయని సింగిల్‌విండో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి అన్నారు. తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పశుబల ప్రదర్శన పోటీలలో భాగంగా ఆదివారం సేద్యపు టెద్దుల విభాగంలో పోటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పోటీలను ప్రారంభించారు. జాతీయ స్థాయిలో ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్న కారణంగా పంటల సాగు, పశు సంపద పెంపులో రైతుల మధ్యన చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు అందించటమే కాకుండా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందిస్తూ సహకరిస్తున్నట్లు వివరించారు.



పశుబల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న సింగిల్‌విండో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి

విజేతలు వీరే

ఈ పోటీలలో 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. 20 నిమిషాలలో 5,413 ఫీట్లు బండలాగిన కంబైండ్ ఎద్దులు ఇటిక్యాల మండలం శనగపల్లి చక్రవర్తి, కర్నూల్ జిల్లా ఊరవాకిడి నడిపి గిడ్డయ్యానాయుడుకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. 5,377 ఫీట్లు బండలాగి కర్నూల్ జిల్లా ఊరవాకిడి చెందిన రేమటి చిన్న గిడ్డయ్యానాయుడి ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం, కంద్రకల్ చెందిన శ్రవణ్‌కుమార్ ఎద్దులు 5,228.9 ఫీట్లు లాగి మూడవ స్థానాన్ని చేజిక్కించుకున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పచ్చర్ల చెందిన సంపత్‌కుమార్ ఎద్దులు 5,163.5 ఫీట్లు లాగి నాల్గవ స్థానంలో నిలిచాయి. రాయలసీమ నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం గోరంట్ల చెందిన హేమనాథ్‌రెడ్డి, వైఎస్ఆర్ కడప జిల్లా ఆలూరు చెందిన సుధీర్‌కుమార్‌రెడ్డి కంబైండ్ ఎద్దులు 5,119 ఫీట్లు బండలాగి ఐదవస్థానాన్ని కైవసం చేసుకోవటం జరిగింది. కార్యక్రమంలో పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, షెక్షావలిఆచారి, మధుకుమార్, రంగు శ్రీధర్, నాగిరెడ్డి, లక్ష్మన్న, ధనుంజయలు పాల్గొన్నారు. అలంపూర్ జోగుళాంబ ఆలయ కమిటి చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తిక్కవీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సీఆర్‌పీలు కృషి చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీలో సీఆర్‌పీల వ్యూహంపై సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆగిన సంఘాలకు పునరుద్ధరణ చేసి వాటిని చైతన్యంగా ఉండేలా చేయాలన్నారు. అనంతరం సీఆర్‌పీల వ్యూహంపై వారితో చర్చించారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సీఆర్‌పీల వ్యూహంపై 15 రోజుల తర్వాత గ్రామ సందర్శన రివ్యూ చేసినట్లు సీఆర్‌పీలు తెలిపారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం చేయడానికి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ)లను 30 గ్రామసంఘాలలో 8 రోజుల చొప్పున ఉండి ఆగిన సంఘాలను పునరుద్ధరణ చేసి, పుస్తక నిర్వహణపై బుక్ కీపర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. స్వయం సహాయ సంఘాలలో లేని మహిళలను చేర్పించడం జరిగిందని, అలాగే కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 45 మంది మహిళలు 15 బృందాలుగా విడిపోయి 12 మండలాల్లో మొదటి ఎనిమిది రోజులు 15 సంఘాలకు శిక్షణలు ఇచ్చామన్నారు. మరో ఎనిమిది రోజులు 15 గ్రామ సంఘాల్లో శిక్షణ ఇచ్చి సభ్యులకు అందరికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో నర్సింహులు, డీపీఎం రమామూర్తి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్, నిర్వాహకులు

- ఏబీవీపీ సంభాగ్ ప్రముఖ్ బీజాపూర్ కరేంద్రనాథ్

గద్వాలటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : త్యాగం, సాహసం, దేశభక్తికి ప్రతిరూపమైన నేతాజి సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందడుగు వేయాలని ఏబీవీపీ సంభాగ్ ప్రముఖ్ బీజాపూర్ కరేంద్రనాథ్ అన్నారు. స్వామి వివేకానంద, నేతాజీల జయంతులను పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆట పోటీల్లో విజేతలైన వారికి ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్‌బాషా మాట్లాడుతూ బాలగంగాధర్‌తిలక్, భగత్‌సింగ్, నేతాజీ వంటి మహనీయుల జీవిత గాథలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, సురేష్, నరేష్, జయంతి, శిరీష, అనూష, మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి



ఉప్పేరు హాస్టల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

- ఎంఈవో రవీంద్రబాబు

ధరూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రణాళికాబద్ధంగా చదవి అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రవీంద్రబాబు విద్యార్థులకు సూచించారు. ఆదివారం మండలంలోని ఉప్పేరు ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఎంఈవో ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్‌లో సరుకులను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడిన ఎంఈవో, ఉపాధ్యాయులు సూచించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం చదవాలన్నారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉందని, టైం టేబుల్ ప్రకారం చదవి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు



గట్టులో అసంపూర్తిగా ఉన్న మండల సమాఖ్య భవనం

- ఏళ్లగా వృథాగా వదిలేసిన అధికారులు
- శిథిలమైన గోడలు, పిల్లర్లు

గట్టు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భవనాలపై పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని పనులు ప్రారంభాలకే పరిమితవ్వగా, మరికొన్ని గోడలు, పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. గ్రామాలలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని హడావుడిగా భవనాలు మంజూరు చేస్తారు. తీరా వాటిని మధ్యలోనే వదిలేస్తున్నారు. పలు గ్రామాలలో ఏళ్లుగా కొన్ని భవనాలు అసంపూర్తిగా నిర్మించారు. దీంతో గోడలు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని పిల్లర్ల వరకు నిర్మించారు. కొన్ని పునాదులకే పరిమితమయ్యాయి. ఇటీవల నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్స్ కూడా పూర్తి చేయలేదు. నిర్మాణాలపై అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో నిధులు వృథా అవుతున్నాయో తప్పా ప్రయోజనం చేకూరడంలేదని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తి నిర్మాణాలు ఇవే..

మండలంలోని మల్లంపల్లిలో పదేళ్ల క్రితం గ్రామానికి మంజూరైన గ్రామాఖ్య మహిళ సంఘం భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పునాదులు వేసి పిల్లర్లు వరకే నిధులు సరి పోవడంతో అప్పటి నుంచి అలాగే వదిలేశారు. పిల్లర్లు కాస్త శిథిలావస్థకు చేరాయి. ఇటీవల శిథిలావస్థకు చేరిన పిల్లర్లతోనే భవన నిర్మాణాన్ని మొదలు పెట్టారు.

- చమన్‌ఖాన్‌దొడ్డిలో విద్యార్థులకు గదుల కొరత ఉండటంతో అదనపు గది నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కేవలం గోడల వరకే నిర్మించి వదిలి వేశారు. దీంతో భవనం ఏళ్లుగా వృథాగా పడగా, ప్రస్తుతం గోడలు శిథిలావస్థకు చేరాయి.

- గట్టులో మహిళా సమాఖ్య భవనం నిర్మించి వదలివేయడంతో శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలో ప్రస్తుతం ఆవులు, గేదేలను వదులుతున్నారు.

- చిన్నోనిపల్లి ఆర్‌అండ్‌ఆర్‌లో పాఠశాల భవనంతో పాటు, అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా నిర్మించారు. ఏళ్ల తర్వాత ఇటీవల పనులను ప్రారంభించారు.

- గట్టులో పంచాయతీ కార్యాలయ భవనం మధ్యలోనే అసంపూర్తిగా నిలిచిపోయింది. ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఇవే కాక మరికొన్ని భవనాలు కూడా అసంపూర్తిగా మండలంలో ఉన్నాయి.

ప్రతిపాదనలు పంపుతాం

ఏఈగా బాధ్యతలు తీసుకుని రెండు నెలలు అయ్యింది. అసంపూర్తి భవనాలను పరిశీలించి ఏ మేరకు నిధులు అవసరమో గుర్తిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలను పంపుతాం.

- రాజేష్, పంచాయతీరాజ్ ఏఈ, గట్టు